విద్యార్థులకు విమాన యోగం

గంగావతి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కొప్పళ తాలూకా లింగదహళ్ళి గ్రామానికి చెందిన ప్రభుత్వ హైస్కూలు విద్యార్థులకు విమానంలో ప్రయాణించే అవకాశం దక్కనుంది. 34మంది విద్యార్థులు, ముగ్గురు ఎస్‌డీఎంసీ పదాధికారులు, ఐదుమంది ఉపాధ్యాయులు డిసెంబరు 6వ తేదీన బళ్లారి జిల్లా ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్‌కు వెళ్ళనున్నారు. ప్రతి విద్యార్థి నుంచి రూ 2500 సేకరించి మిగిలిన మొత్తాన్ని ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ/ప్రైవేట్ కంపెనీల నుంచి సేకరించారు. మిగిలిన మొత్తాన్ని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ అందజేయనున్నట్లు ఉపాధ్యాయులు నాగరాజు తెలిపారు.

మంగళముఖిలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ర్యాలీలో మంగళముఖిలు

బ్యాంకు ఉద్యోగులకు జైలు శిక్ష

- సిండికేట్ బ్యాంక్‌కు రూ. 12.63 కోట్ల మోసంలో కోర్టు తీర్పు

మహిళా పారిశ్రామికవేత్త ఆత్మహత్య కేసులో... సీఐడీ డీఎస్పీపై ఎఫ్ఐఆర్

- బాధితురాలి చెల్లెలి ఫిర్యాదుతో నమోదు

వివరాలు 7లో..


కేంద్ర, రాష్ట్రాల కృషి తోనే విద్యలో సమూలమార్పులు : వీసీ



స్నాతకోత్సవాన్ని ప్రారంభిస్తున్న బెంగళూరు వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జైకరశెట్టి

విజయోత్సాహం..!

- ఉప ఎన్నికల్లో గెలుపుతో కాంగ్రెస్‌లో ఉత్సాహం
- హాసన్‌లో భారీ సభకు ఏర్పాట్లు
- దేవెగౌడ సొంత జిల్లాలో బలప్రదర్శనే లక్ష్యం
- పార్టీ శ్రేణులకు సిద్దరామయ్య మార్గదర్శకాలు




బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలు జరిగిన మూడు నియోజకవర్గాల్లో విజయంతో సీఎం సిద్దరామయ్యలో ఉత్సాహం రెట్టింపయ్యింది. హాసన్‌లో విజయోత్సవ సభ నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేయాలని సీఎం పార్టీ వర్గాలకు సూచించారు. ఎన్నికలకు ముందు దావణగెరెలో సిద్దరామయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని సిద్దరామోత్సవ పేరిట భారీ సభ నిర్వహించారు. ఏకంగా 5లక్షలమంది దాకా సభలో పాల్గొనడంతో రాజకీయం అప్పట్లో వేడెక్కింది. ఇటీవల కొన్ని రోజులుగా సీఎం సిద్దరామయ్య 'ముడా' కేసులు చుట్టుముట్టాయి. ఎఫ్ఐఆర్‌లు, నోటీసులు, విచారణల పరంపర సాగుతోంది. తొలుత హాసన్‌లో అహింద సభ జరపాలని భావించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా సభ కొనసాగించాలని కూడా ప్రాథమికంగా చర్చలకు వచ్చినట్టు తెలుస్తోంది. అయితే పార్టీ, ప్రభుత్వంతో సంబంధం లేకుండా సిద్దరామయ్య అభిమానుల ఆత్మాభిమాన సభగా మార్చారు. శాసనసభ ఉప ఎన్నికల్లో మూడు స్థానాల్లో గెలుపొందడం, పైగా జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు నిఖిల్ చిత్తుగా ఓడిపోవడం వంటి అంశాలు సిద్దరామయ్య అభిమానులకు ఉత్సాహం రేకెత్తించింది. సిద్దరామయ్య ప్రభుత్వాన్ని కూల్చేవరకు విశ్రమించేది లేదని దేవె గౌడ సవాల్ విసిరిన కొన్ని రోజుల్లోనే మనవడి ఓటమి జేడీఎస్ వర్గాలుగా జీర్ణించుకోలేని విధంగా మార్చింది. దేవెగౌడ సొంత జిల్లాలో భారీ సభ ద్వారా అభిమానుల్లో మరింత జోష్ నింపాలని సిద్దరామయ్య భావిస్తున్నట్లు తెలుస్తోంది. శనివారం హాసన్‌లో సిద్దరామయ్య కుమారుడు యతీంద్రతోపాటు మంత్రులు మహదేవప్ప, రాజణ్ణ, వెంకటేశ్, బోసరాజులు, ప్రత్యేక సమావేశం జరిగింది. ఇందులో సభ ఏర్పాట్లతోపాటు ముఖ్య నాయకులకు కీలకమైన బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. హాసన్, మైసూరు, మండ్య, చామరాజనగర, కొడగు, చిక్కమగళూరు జిల్లాలకు చెందిన సిద్దరామయ్య అభిమానులందరినీ ఐక్యం చేయదలిచారు. ఇదే విషయమై మంత్రి మహదేవప్ప మీడియాతో మాట్లాడుతూ సిద్దరామయ్య అభిమానుల సంఘం ద్వారా సభ జరుపుతున్నామన్నారు. 14సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత కల్గిన నాయకుడికి మద్దతు ఇవ్వడంతోపాటు ధన్యవాదాలు తెలిపేందుకు సభ జరుపుతున్నామన్నారు.

సన్ స్ట్రోక్..!



- కొంపముంచిన వారసులు
- కుమారుల ఓటమితో ఖంగుతిన్న కుమారస్వామి, బొమ్మై
- తాత, తండ్రి తరహాలోనే భరత్ బొమ్మై తొలి పరాజయం



బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌లో ఉత్సాహాన్ని నింపితే బీజేపీ, జేడీఎస్‌లో నిరాశ మిగిల్చాయి. మరీ ముఖ్యంగా కుమారస్వామి, బొమ్మై కుటుంబాల్లో మరింత విచారాన్ని నింపాయి. తమ వారసులను గెలిపించుకోలేక మాజీ ముఖ్యమంత్రులు డీలా పడ్డారు. రాష్ట్రంలో నాలుగైదు కుటుంబాలు దశాబ్దాలకాలంగా వారసత్వ రాజకీయాన్ని కొనసాగిస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో అత్యంత కీలకమైన ముఖ్యమంత్రి పదవిలో కొనసాగినా వారసులను మాత్రం గెలిపించుకోలేకపోయారు. రాజకీయాల్లో ఆటుపోట్లు సహజమే అయినా కేవలం మూడు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ-జేడీఎస్‌ల కూటమి ఘోరంగా ఓటమి చవిచూసింది. పొరుగున ఉండే మహారాష్ట్రలో దశాబ్దాల చరిత్రను తిరగరాసేలాంటి ఫలితాలు నమోదు కాగా రాష్ట్రంలో జరిగిన మూడు స్థానాల్లో సండూరు నుంచి రాజకీయాలతో సంబంధంలేని బంగారు హనుమంతు అధికార కాంగ్రెస్ అభ్యర్థి, ఎంపీ తుకారాం భార్య అన్నపూర్ణకు గట్టిపోటీ ఇచ్చారు. కానీ దశాబ్దాలకాలంగా రాజకీయమే పరమావధిగా కొనసాగిన జేడీఎస్ నేత దేవెగౌడ, బీజేపీ నేత బసవరాజ్ బొమ్మైల పలుకుబడితోపాటు అన్ని విధాలా ప్రయోగాలు చేసినా వారసులు చిత్తుగా ఓడిపోయారు. రెండు కుటుంబాలకు చెందిన రాజకీయ దిగ్గజాలకు ఓటమి కొత్తేమీ కాకపోయినా సాధారణ ఎన్నికల్లో పెను ప్రభావం ఉండదు. కానీ జరిగిన మూడు స్థానాల్లో కీలకనేతల కుటుంబాలకు చెందిన ఇద్దరు ఘోర పరాజయం వారితోపాటు బీజేపీ-జేడీఎస్ అభిమానులు, కార్యకర్తలకు తీవ్రనిరాశ మిగిల్చింది.



నిఖిల్ కుమారస్వామి

దేవెగౌడ కుటుంబానికి ఓటమి కొత్తేమీ కాదు

జేడీఎస్ నేత దేవెగౌడ స్థానిక సంస్థల రాజకీయాల తర్వాత 1962లో హాసన్ జిల్లా హొళెనరసీపురనుంచి తొలిసారి ఇండిపెండెంట్‌గా ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 1967లోనూ ఇండిపెండెంట్‌గానే ఎమ్మెల్యే అయ్యారు. ఇలా వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన దేవెగౌడ 1989లో కాంగ్రెస్ అభ్యర్థి పుట్టస్వామిగౌడ చేతిలో ఓడిపోయారు. తర్వాత 1999లో హాసన్ ఎంపీ స్థానం నుంచి అదే పుట్టస్వామిగౌడ చేతిలో మరోసారి ఓటమి చెందారు. 2004లో కనకపుర ఎంపీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి తేజస్విని చేతిలో ఓటమి చెందారు. తాజాగా కాంగ్రెస్-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా తుమకూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి జీఎస్ బసవరాజ్ చేతిలో ఓడిపోయారు. అయితే ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ సహకారంతో రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అనూహ్యంగా దేవెగౌడ రాజకీయ సమీకరణలో ప్రధానమంత్రి పదవిని అలంకరించారు. రాష్ట్రంలో అత్యున్నతమైన పదవిని పొందినవారిలో దేవెగౌడ ఒకరిగా నిలిచారు. దేవెగౌడ కుమారుడు కుమారస్వామి తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చారు. 1996లో కనకపుర నుంచి ఎంపీగా గెలుపు సాధించారు. ఆ తర్వాత 1998, 1999 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా ఓడారు. 1999లో సాతనూరు ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసి అక్కడా ఓడారు. 2014లో చిక్కబళ్లాపుర నుంచి ఎంపీ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. కుమారస్వామి ఏకైక రాజకీయ వారసుడు నిఖిల్‌కు భిన్నమైన చేదు అనుభవాలు ఎదురయ్యాయి. సినిమా రంగంలో రాణిస్తున్న నిఖిల్ అనూహ్యంగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్-జేడీఎస్ పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా మండ్య నుంచి పోటీ చేసి ఘోరంగా ఓటమి చెందారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉండాలని భావించారు. కానీ 2023 శాసనసభ ఎన్నికల్లో తల్లి అనితా ప్రాతినిధ్యం వహిస్తున్న రామనగర నుంచి పోటీ చేసి రెండో సారి ఓటమి మూటగట్టుకున్నారు. తండ్రి కుమారస్వామి ఎంపీగా ఎన్నికై కేంద్రమంత్రి కావడంతో ఖాళీ అయిన చన్నపట్టణ నుంచి ఉప ఎన్నికల్లో బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసి ఘోరమైన ఓటమిని చవిచూశారు. ఇలా వరుసగా మూడుసార్లు ఓడిపోయిన ఘనత నిఖిల్‌కే చెల్లుతుంది. కానీ రాజకీయ సమీకరణల మార్పులతో సొంతంగా మెజారిటీ లేకపోయినా ఓసారి 2006లో బీజేపీ మద్దతుతో ముఖ్యమంత్రి అయ్యారు. 2018 శాసనసభ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో మరోసారి కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వంలో సీఎంగా 18 నెలలపాటు కొనసాగారు.



భరత్ బొమ్మై

తాత, తండ్రి తరహాలోనే భరత్ బొమ్మై

రాష్ట్ర రాజకీయాల్లో తాత, తండ్రి వారసుడి తరహాలో రాజకీయ ప్రవేశం చేసిన కొద్ది కుటుంబాలలో బసవరాజ్ బొమ్మైది కూడా ఉంది. బసవరాజ్ బొమ్మై తండ్రి ఎస్ఆర్ బొమ్మై ముఖ్యమంత్రిగా వ్యవహరించగా ఇటీవల రెండున్నరేళ్లపాటు బసవరాజ్ బొమ్మై సీఎంగా కొనసాగిన విషయం తెలిసిందే. కానీ బసవరాజ్ బొమ్మై కుమారుడు పారిశ్రామికవేత్త భరత్ బొమ్మై తొలి ఎన్నికల్లో ఓటమి చవి చూశారు. శిగ్గావి నుంచి గెలుపొందిన బసవరాజ్ బొమ్మై మంత్రితోపాటు కీలకమైన పదవులు అనుభవించారు. 2021 నుంచి 2023వరకు బసవరాజ్ బొమ్మై సీఎంగా కొనసాగారు. ఇటీవల ఎన్నికల్లో శిగ్గావి నుంచి బొమ్మై గెలుపొందినా పార్టీ అధిష్ఠానం ఆదేశాలతో హావేరి నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఖాళీ అయిన స్థానంనుంచి కుమారుడు భరత్‌ను రాజకీయ అరంగేట్రం చేయించే ప్రయత్నంలో బొమ్మై బోల్తా పడ్డారు. న్యాయవాదిగా కొనసాగుతున్న ఎస్ఆర్ బొమ్మై 1962లో కుందగోళ స్థానం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి టీకే కంబాళ చేతిలో తొలి ఓటమి పొందారు. అయితే 67లో ప్రత్యర్థిపైనే గెలుపు సాధించారు. ఆ తర్వాత జనతా పార్టీలో 1978 నుంచి 1985 వరకు మూడు ఎన్నికల్లో గెలుపొందారు. 1988-89ల మధ్య రాష్ట్ర నాల్గో ముఖ్యమంత్రిగా కొనసాగారు. 1994 లో ఎస్ఆర్ బొమ్మై కుమారుడు బసవరాజ్ బొమ్మై హుబ్బళ్ళి గ్రామీణ నుంచి పోటీ చేసి జగదీశ్‌శెట్టర్ చేతిలో ఓడిపోయారు. తర్వాత స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ అయ్యారు. 2008 నుంచి 2024 వరకు వరుసగా నాలుగుసార్లు హావేరి జిల్లా శిగ్గావి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2021-23ల మధ్య రాష్ట్ర 23వ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ఇక బసవరాజ్ బొమ్మై కుమారుడు భరత్ బొమ్మై తండ్రి ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం నుంచి రాజకీయాల్లోకి రావాలని ఉప ఎన్నికల్లో పోటీ చేశారు. బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దిగి కాంగ్రెస్ అభ్యర్థి యాసిర్ అహ్మద్‌ఖాన్ పఠాన్ చేతిలో 13,448 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. వారసులకు కాకుండా ఉప ఎన్నికల్లో ఇతరులకు అవకాశం కల్పించి ఉంటే బీజేపీ-జేడీఎస్ కూటమికి ఇటువంటి ఘోరమైన పరిస్థితి ఎదురయ్యేది కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కుటుంబ రాజకీయాలపై సొంత పార్టీలోనే విమర్శలు వినిపిస్తున్నా లెక్క చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ ఓటమికి తండ్రీకొడుకులే కారణం

- విజయేంద్రపై తిరగబడ్డ యత్నాళ్
- చర్యలు తప్పవన్న పార్టీ అధ్యక్షుడు



బెంగళూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): శాసనసభ ఉప ఎన్నికల్లో మూడు చోట్ల ఓటమికి తండ్రీ కొడుకులే కారణమని బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ ఆరోపణలపై పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన విజయేంద్ర ఎన్నికల్లో ఇటువంటి ఫలితాలు ఊహించలేదన్నారు. పొరుగున మహారాష్ట్రలో ఊహకు అందని ఫలితాలు వచ్చాయన్నారు. యత్నాళ్ పరుషంగా మాట్లాడడం మానుకోవాలని, లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పార్టీలో విబేధాలకోసం ప్రయత్నించరాదన్నారు. కాగా ఎన్నికల ఫలితాల తర్వాత యత్నాళ్ మీడియాతో మాట్లాడుతూ మహారాష్ట్రలో గెలుపు సంతోషాన్ని ఇచ్చిందని, కర్ణాటకలో హీనంగా ఓడేందుకు తండ్రి యడియూరప్ప, కొడుకు విజయేంద్రలే కారణమని ఆరోపించారు. వక్ఫ్ వివాదాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడంలో విఫలమయ్యారన్నారు. ఇదే అంశం పై మహారాష్ట్రలో మంచి ఆదరణ లభించిందన్నారు. ఫలితాలకు ఒకరోజుముందు విజయేంద్ర ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను కలసి రాష్ట్రంలో పార్టీ పరిస్థితిని వివరించారు. వక్ఫ్ వివాదంపై వేర్వేరుగా ఆందోళనలు చేసే పరిస్థితిని వివరించినట్లు తెలుస్తోంది. డిసెంబరులో రాష్ట్ర పార్టీ విబేధాలను పరిష్కరిద్దామని భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈలోగానే యత్నాళ్ వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర దుమారం రేపాయి.



పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలి

విజయపుర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని ప్రభుత్వ పీయూ కళాశాలలోని హైస్కూల్‌కు 75 సంవత్సరాల చరిత్ర ఉందని వేలాదిమంది విద్యార్థుల ఆశయాలు సాకారంకోసం సీనియర్ విద్యార్థుల సంఘం కృషి చేయాలని పూర్వ విద్యార్థుల సంఘం సంస్థాపకురాలు, రచయిత్రి ఇందిరా శివణ్ణ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని రోటరీ స్కూల్‌లో ఆదివారం ఏర్పాటైన ప్రభుత్వ పీయూ కళాశాలలోని హైస్కూల్ విద్యార్థుల సంఘం సర్వసభ్య సమావేశంలో ఎంపికైన నూతన పదాధికారులను అభినందించి మాట్లాడారు. సీనియర్ పూర్వ విద్యార్థి నారాయణస్వామి మాట్లాడుతూ పాఠశాలకు 75ఏళ్లు గడిచిన కారణంగా ప్రత్యేక స్మరణ సంచికను రూపొందించదలిచామన్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా ఎంపికైన వీఎం కిశోర్‌కుమార్ మాట్లాడుతూ సంఘం ఆశయాలు నెరవేరాలంటే ప్రతి సభ్యుడు కూడా సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ పురస్కార గ్రహీత ఉపాధ్యాయుడు ఎం శివకుమార్ మాట్లాడుతూ నూతన కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని సంఘం పురోగతికి తన వంతు కృషి చేస్తానన్నారు. సీనియర్ విద్యార్థి ఎల్ కాళప్ప మాట్లాడుతూ సంఘం స్థాపన ద్వారా ఎంతోమంది పూర్వ విద్యార్థులు భేటీ అయ్యేందుకు అవకాశం ఉందన్నారు. ప్రతి బ్యాచ్ విద్యార్థి తమ సహచర విద్యార్థులను గుర్తించి సభ్యులుగా చేయాలన్నారు. 1945, 50, 60 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు రిటైర్డు ఎయిర్ మార్షల్ టి నాగరాజ్, రిటైర్డు ప్రిన్సిపాల్ టి నారాయణస్వామి, శంకర్, రోటరీ మాజీ అధ్యక్షుడు సి బసప్ప, తాజా మాజీ కార్యదర్శి మాతృభాష యాప్ పరిశోధకులు ఆర్ చందన్, వీణా, లీలమ్మ, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం పదాధికారులు

ఓ వర్గం మాకు మద్దతు ఇవ్వలేదు: నిఖిల్



కార్యకర్త మంజునాథ్‌ను పరామర్శిస్తున్న నిఖిల్

బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చన్నపట్టణ ఎన్నికల్లో మైనారిటీలు తమకు మద్దతు ఇవ్వలేదని, అదే ఓటమికి కారణమని నిఖిల్ కుమారస్వామి తెలిపారు. ఆదివారం శ్రీరాంపుర గ్రామంలో కార్యకర్త మంజునాథ్‌ను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు గృహలక్ష్మి నిధులు జమ చేశారని, ఇలాంటివి ఎన్నికల కమిషన్ పరిశీలించాలన్నారు. మేం పోరాటం చేసేందుకు ప్రభుత్వ వైఫల్యాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఓటమితో దిగాలు పడేది లేదని, ఓడినచోటే గెలుపుకోసం పోరాడుతానన్నారు. ఎన్నికల్లో భారీగా ఓట్లు వచ్చాయని అయితే ఓ సామాజికవర్గం పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వలేదన్నారు. దేవెగౌడ సేవలను గుర్తుంచుకోలేదన్నారు. మా ఆవశ్యకత వారికి లేదనిపిస్తోందన్నారు. వారిని వదిలే స్ట్రాటజీ చేయాల్సి ఉంటుందన్నారు. మేం కాంగ్రెస్ వారి వద్దకు వెళ్లలేదని, వారే వచ్చి అన్యాయం చేశారని అందుకే బీజేపీతో కలసి ఉన్నామన్నారు. మా ఆలోచనలకు మించి ప్రజల మద్దతు లభించిందన్నారు. కాగా నిఖిల్ ఓటమిపై కద్దూరు గ్రామానికి చెందిన ఓ కార్యకర్త మంజునాథ్ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. నిఖిల్ ఓటమిని జీర్ణించుకోలేకనే ఇటువంటి నిర్ణయం తీసుకున్నానని, నా చావుకు నేనే కారణమని జై జేడీఎస్ జై ఎన్డీయే నోట్ రాశాడు. స్థానికులు వెంటనే గమనించి ప్రథమ చికిత్స అందించి మండ్య మెడికల్ కళాశాలకు తరలించారు. ఇంటికి చేరుకున్న మంజునాథ్‌ను నిఖిల్ కుమారస్వామి పరామర్శించారు. ఆవేశంలో నిర్ణయాలు తీసుకోరాదని హితవు పలికారు. మరో అభిమాని నిఖిల్ కోసం రక్తంతో లేఖ రాశారు. నిఖిల్ ఆరోపణలపై జేడీఎస్ మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం స్పందించారు. మీ తాత దేవెగౌడ సీఎం, పీఎంలు అయ్యేందుకు మైనారిటీల ఓట్లే కారణమన్నారు.

ఉత్సాహంగా కెనరాబ్యాంకు మారథాన్

- ఆరోగ్యం, ఫిట్‌నెస్ అభిరుచికి వేదిక
- కెనరాబ్యాంకు సీఎండీ సత్యనారాయణ రాజు

బెంగళూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు రెండో ఏడాది నిర్వహించిన మారథాన్ ఆదివారం ఉత్సాహంగా సాగింది. నగరంలోని కంఠీరవస్టేడియంలో ఆదివారం 10కే, 5కే, 3కే రన్ విభాగాలను కెనరాబ్యాంకు సీఎండీ కే సత్యనారాయణ రాజు, ప్రముఖ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్‌లు జెండా ఊపి ప్రారంభించారు. తెల్లవారు 5గంటలకు మారథాన్ ప్రారంభమయ్యింది. వివిధ విభాగాల వారీగా పోటీలు సాగాయి. ఈ సందర్భంగా సీఎండీ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ మారథాన్ కేవలం రేస్ మాత్రమే కాదని ఐక్యవేదికగా మారిందన్నారు. ఆరోగ్యం, ఫిట్‌నెస్ పట్ల బెంగళూరు ప్రజలకు అభిరుచి ఎక్కువన్నారు. ఆ ఉత్సాహం కనిపించిందన్నారు. అన్నివర్గాల ప్రజలను మారథాన్ వేదికగా చేర్చిందన్నారు. అనుభవజ్ఞులైన అథ్లెట్‌లనుంచి మొదటిసారి మారథాన్‌లో పాల్గొన్నవారు అసాధారణమైన ప్రతిభను కనబరిచారన్నారు. ఆరోగ్యం, జీవనశైలి పట్ల బెంగళూరు వాసులు ఆసక్తి చూపుతారని అందుకు అనుగుణంగాన మారథాన్‌లోనూ వివిధ వయస్సుల వారు పోటీ పడి పరుగెత్తడం ప్రతిబింబించిందన్నారు. మారథాన్‌లో 9వేలమందికి పాల్గొనడం సంతోషం కలిగించిందన్నారు. 10కే పురుషుల విభాగంలో వినోద్‌సింగ్ ప్రథమ బహుమతిని, మహ్మద్ నూర్ హుసేన్ ద్వితీయ బహుమతిని, సునీల్‌ధావర్ తృతీయ బహుమతిని సాధించారు. ఇక మహిళల విభాగంలో సంజీవని జాధవ్ మొదటి విజేతగాను, సోనికా ద్వితీయ విజేతగా, పూనమ్ సొనునె తృతీయ విజేతగా నిలిచారు. 10కే విజేతలకు స్త్రీ, పురుషుల విభాగంలో రూ.2లక్షలు చొప్పున, 5కే విజేతలకు రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కెనరాబ్యాంకు నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ విజయ్ శ్రీరంగన్, డీజీ రామకృష్ణ ప్రసాద్, క్రికెటర్ సునిల్‌జోషితోపాటు కెనరాబ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు, జనరల్ మేనేజర్‌లు ఇతర ముఖ్యులు భాగస్వామ్యులయ్యారు.



10కే రన్ విజేతలతో బ్యాంకు సీఎండీ సత్యనారాయణరాజు, మారథాన్‌లో సందడి





తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1630.42	1596.85
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,118	556
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,798	10,741
నీటి నిల్వ (టీఎంసీలు)	95.66	17.72

నీటిలో మునిగి విద్యార్థి మృతి

కంప్లి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి) : విజయనగర జిల్లా కొట్టూరు తాలుకా నిబంళగేరికు చెందిన ఎం సందీప్ (18) అనే విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందాడు. ఆదివారం సెలవు రోజు కావడంతో గ్రామంలోని గోవినకట్ట వద్ద చెరువులో స్నానానికి వెళ్లిన యువకుడు లోతైన గుంతలో పడి నీటము నిగాడు. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో సహాయం కోసం కేకలు వేసినా ప్రతిఫలం లేకపోయింది. ఊపిరాడక నీట మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

ఆభరణాల దొంగల అరెస్ట్

రాయచూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిరవార తాలూకా అత్తనూరు కవితాళ గ్రామ ఆలయాల్లో ఆభరణాలు ఎత్తుకెళ్లిన దొంగలను సిరవార పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సిరవార తాలూకా అత్తనూరు గ్రామంలో 50 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు 4,330 గ్రాముల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లగా వాటి విలువ దాదాపు రూ.6 లక్షలకు పైగా ఉన్నట్లు అంచనా వేశారు. దీంతో పాటు కవితాళలోని దేవాలయంలో మొత్త వెండి ఆబరణాలు ఎత్తుకెళ్లగా వాటి విలువ 1లక్ష 70వేలుగా గుర్తించారు. ఈ రెండు దొంగతనాలకు బాధ్యులుగా గుర్తించిన హుసేని, శరణ బసప్ప, వీరస్వామిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఈ ముగ్గురు కూడా మాన్వి తాలూకా కపగల్ గ్రామానికి చెందినవారుగా గుర్తించారు. దొంగతనం కోసం వినియోగించిన బైక్‌తో పాటు నిందితులను ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

రథోత్సవాన్ని విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే



జాతర పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

రాయచూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన దేవసుగూరు సుక్షేత్రం సూగూరేశ్వర స్వామి జోడు రథోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ సూచించారు. జోడు రథోత్సవాల నిర్వహణకు సంబంధించి ఆదివారం దేవసుగూరులోని ఆలయ పాలక మండలి, గ్రామస్థులతో కలిసి ఆలయం వద్ద పూర్వసిద్ధత సమావేశం నిర్వహించారు. జాతర ఉత్సవానికి రథోత్సవాలను తిలకించేందుకు జిల్లాతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు వేల సంఖ్యలో హాజరవుతున్నందున ఏర్పాట్లను ఇబ్బంది కలగకుండా చేపట్టాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

సామాన్యులకు చట్టంపై అవగాహన తప్పనిసరి

● జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి శాంతి



మాట్లాడుతున్న జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి శాంతి

బళ్లారి గాంధీనగర్/సిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సమాజంలో సామాన్యులు సైతం చట్టంపై అవగాహన పెంచుకోవాలని, వివిధ రకాలుగా మోసపోయిన వారికి చట్టం పట్ల అవగాహన కల్పించడంతో పాటు అలాంటి వారికి న్యాయం కల్పించే దిశలో న్యాయ సేవకులు కృషి చేయాలని జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి, చట్టసేవ ప్రాధికార అధ్యక్షులు కె.జి. శాంతి పేర్కొన్నారు. జిల్లా చట్టసేవ ప్రాధికార, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, బళ్లారి జిల్లా న్యాయవాదుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని తాళూరు రోడ్డు నూతన న్యాయాలయం సభాంగణంలో బళ్లారి జిల్లా పార్ట్‌టైమ్ స్వయం సేవకులకు ఆదివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'సర్వరిగూ సమపాలు - సర్వరిగూ సమబాళు' అనే రీతిలో ప్రజలు ప్రశాంతమైన జీవనం గడిపేందుకు తమ దైనందిత జీవితంలో చట్టం పట్ల అవగాహన అవసరమని, ప్రతి ఒక్కరూ చట్టం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్య వివాహ, వరకట్నం వేధింపులు, బాల కార్మిక పద్దతి, పోక్సో చట్టం, మాదక వ్యసనం ఇతరత్రా చట్ట వ్యతిరేక పరమైన కేసులు వచ్చినపుడు పార్ట్‌టైమ్ సేవకులు, సార్వజనికులు సహా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చి అన్యాయం, దౌర్జన్యాలను అరికట్టేదిశలో పోరాడాలని పిలుపునిచ్చారు. పేదరికం, జ్ఞానం కొరత, అసాహాయత ద్వారా అన్యాయానికి గురైన వారికి న్యాయపరమైన సలహాలు అందించి బాధితులకు సకాలంలో న్యాయం చేకూర్చాలని, పేదలు, బాధితల, మహిళల, కార్మికుల పరంగా ప్రభుత్వం ఎన్నో పథకాలు రూపొందించిందని, అర్హులైన లబ్దిదారులకు పథకాల ఫలాలు అందేలా చూడాలన్నారు. రాజ్యాంగంలో ఉన్న హక్కు, కర్తవ్యాలను ఒకే నాణ్యానికి రెండు ముఖలాంటివని, సార్వజనికుల హక్కులు సద్వినియోగం చేసుకోవడంతో పాటు తమకున్న కర్తవ్యాలను గురించి తెలుసుకుని న్యాయయుతమైన జీవనం సాగించాలని చెప్పారు. జిల్లా చట్ట ప్రాధికార మెంబర్ సెక్రటరీ రాజేష్ ఎస్.హొసమనె కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎలాంటి స్వలాభం ఆశించకుండా స్వచ్ఛందంగా న్యాయసేవలు అందించేందుకు స్వయం సేవకులు సమాజాభివృద్ధికి కృషిచేయాలన్నారు. బళ్లారి జిల్లా రిటైర్డ్ న్యాయమూర్తి హడగలి రాము, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పి. రామబ్రహ్మం, కూడ్లిగి స్నేహ సంస్థ డైరెక్టర్ టి.రామాంజినేయులతో పాటు వివిధ సంస్థల పదాధికారులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల ఫలితాలు ప్రతిపక్షానికి చెంపపెట్టు

●కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వసంత్‌కుమార్ ●బ్యాలెట్ ద్వారానే నిష్పాక్షిక ఎన్నిక సాధ్యమని విశ్వాసం

రాయచూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన మూడు ఉప ఎన్నికల ఫలితాలు ప్రతిపక్షంలోని బీజేపీ-జేడీఎస్‌లతో పాటు ఆర్ఎస్ఎస్‌లకు చెంపపెట్టు లాంటివని కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ ఎ.వసంత్ కుమార్ అన్నారు. దేశంలో ఎన్నికల పద్ధతిని ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించినప్పుడే నిష్పాక్షిక ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఈ విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకుని తిరిగి బ్యాలెట్ పద్ధతి ఉపయోగించేలా తగిన సూచనలు లేదా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఆదివారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వసంత్ కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన మూడు ఉప ఎన్నికల్లోను కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజలు ఘన విజయం కట్టబెట్టారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. గడచిన 11 నెలలుగా రాష్ట్రంలో సాగుతున్న కాంగ్రెస్ పాలనకు ఇచ్చిన హామిలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లకు రాష్ట్ర ప్రజలు మరో సారి తమ మద్దతును ప్రకటించారన్నారు. కాగా మహారాష్ట్రలో బీజేపీ గెలుపు పై మాట్లాడిన వసంత్ కుమార్, గత లోకసభ ఎన్నికల్లో వచ్చిన సీట్లతో పోల్చుకుంటే శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీకి గట్టి దెబ్బె తగిలిందని సీట్ల పరంగా మాత్రమే ఆధిక్యత లభించిందన్నారు. దీంతో పాటు ప్రధాని మోదీ, అమిత్ షాలు ప్రజా మద్దతుకంటే కూడా ఈవీఎంల పైనే ఎక్కువగా ఆధారపడుతున్నారని ఆరోపించారు. నిజంగా బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఈవీఎంల సహకారం లేకుండానే తాము గెలిచామని ధైర్యంగా ప్రజ ముందు ఒప్పుకోవాలని సవాలు విసిరారు.



విలేకరులతో మాట్లాడుతున్న వసంత్ కుమార్

కన్నయ్య నాయుడు సేవలు మరువలేనివి



కన్నయ్యనాయుడును సన్మానిస్తున్న కమ్మసంఘం నాయకులు

కంప్లి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యామ్‌కు గేట్లను అమర్చడంలో కన్నయ్య నాయుడి కృషి మరువలేమని కుడితిని కమ్మసంఘం అధ్యక్షులు రాము తెలిపారు. ఆదివారం ఆయన సింధనూరులో కార్తీక వనభోజనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నయ్యనాయుడిని ఘనంగా సత్కరించారు. అనంతరం రాము మాట్లాడుతూ తుంగభద్ర జలాశయంలో 19వ గేటు కొట్టుకుపోయిన సమయంలో కన్నయ్య నాయుడు చొరవతోనే నీరు వృథా కాకుండా రైతులకు మేలు జరిగిందన్నారు. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ప్రజల గుండెల్లో కన్నయ్యనాయుడు చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.

ఘనంగా సామూహిక వివాహాలు

బళ్లారిరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉచిత సామూహిక వివాహాల్లో పలువురు దంపతులు ఒక్కటయ్యారు. బళ్లారి రూరల్ పరిధిలోని శిరివరం గ్రామం వద్ద అమరేశ్వర దేవస్థానం సమీపంలో ఆదివారం జరిగిన వివాహ వేడుకల్లో కన్నడ రక్షణ వేదిక అధ్యక్షుడు కప్పగల్లు మునుస్వామి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు ఉచిత సామూహిక వివాహాలు ఎంతో ఉపయోగకరమన్నారు. వివాహాలను 19 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వివాహాలకు బళ్లారి నగర ప్రజలతో పాటు గ్రామీణ ప్రజలు నూతన వధూవరులను ఆశీర్వదించారు.



వధూవరులతో కరవే నాయకులు



కార్యక్రమంలో పాల్గొన్న కమ్మసంఘం నాయకులు

వనభోజనానికి ఘన చరిత్ర

● కమ్మసంఘం గౌరవాధ్యక్షుడు కొల్లి శ్రీనివాసరావు

సిరుగుప్ప, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వన బోజనానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని, సంప్రదాయాలను వచ్చే తరానికి నేర్పాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎంతో వుందని కమ్మసంఘం గౌరవాధ్యక్షుడు కొల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం సిరుగుప్ప పట్టణం కమ్మసంఘం భవనంలో కార్తీక మాసం పురస్కరించుకుని వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కమ్మసంఘం కులబాంధవులు దేశ విదేశాలలో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అవసరమైన వారిని ఆదుకోవడంలో సంఘం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో రాణించిన వైద్యులకు ఘనంగా సన్మానం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన కమ్మ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ప్రతిభా పురస్కారాలు అందజేశారు. పదవతరగతిలో అత్యధిక మార్కులు దక్కించుకున్న రూప, యశోప్రదీత, జశ్వంత్‌లకు ప్రత్యేక సన్మానం చేశారు. ఈ సందర్భంగా కమ్మసంఘం అధ్యక్షుడు జాలాది రాధాకృష్ణ, కోశాధికారి సురేష్, కార్యదర్శి సత్యనారాయణ, ప్రముఖ వైద్యులు లలిత, హరి దత్తాత్రేయ, వీరభద్రరావు, రఘు కిరణ్, సుధాకర్, శ్రీకాంత్, ప్రశాంత్, కమ్మ కార్యవర్గం సభ్యులు మురళి, ప్రసాదరావు, గణేష్, చౌదరి, కమ్మ కులబాంధవులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న కొల్లి శ్రీనివాసరావు

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



విద్యార్థులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త బాలసుబ్రహ్మణ్యం

బళ్లారి సిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):నగరంలోని వీరశైవ విద్యావర్ధకసంఘంకు చెందిన ఎస్‌కే మోదీ నేషనల్ పాఠశాలలో సామాజిక, వైజ్ఞానిక వస్తు ప్రదర్శన ఆదివారం జరిగింది. బెంగళూరుకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డా.బాలసుబ్రహ్మణ్యం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. డార్విన్ పరిణామ సిద్ధాంతం గురించి వివరించారు. వి.వి.సంఘం అధ్యక్షుడు అల్లం గురుబసరాజ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సానుకూలంగా సాగుతున్నామన్నారు. అనంతరం 2023-24 విద్యాసంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అశోక్ లేలాండ్ కంపెనీ ప్రతినిధులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జానెకుంటే బసవరాజు, సంయుక్త కార్యదర్శి మేటి పంపన్‌గౌడ, సంఘం సభ్యుడు విరూపాక్షప్ప, కార్యవర్గ సభ్యులు అల్లం ప్రమోద్,నరేంద్రబాబు, చన్నబసవరాజు, మోదీ స్కూల్ ప్రెసిడెంట్ రాజశేఖర్, స్కూల్ ప్రిన్సిపాల్ సునంద,డిప్యూటీ మేనేజర్ శ్రీరామప్రసాద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైతుల నిరసన



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

కంప్లి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో పరిశ్రమల కోసం భూములు పోగొట్టుకున్న రైతులు చేపట్టిన నిరసన రెండేళ్లుగా కొనసాగుతోంది. అరిగిణదోణి, జానెకుంట, ఎర్రంగళి, కప్పగల్, సిద్దమ్మనహళ్లి, వేణి వీరాపురం, తిమ్మలాపురం రైతులు న్యాయం కోసం సుమారు 708 రోజులుగా నిరసనలు చేపడుతున్నా ఇంత వరకు న్యాయం జరుగలేదని ఆవేదనకు గురవుతున్నారు. ఈ సందర్భంగా రక్షణ వేదిక అధ్యక్షుడు జంగ్లిసాబ్ మాట్లాడుతూ రైతులకు ఎన్నో సంఘాలు మద్దతు కల్పిస్తున్నారు. ఇన్ని రోజుల నుంచి న్యాయం పోరాటం చేస్తున్నా నాయకులు వచ్చిపలకరించి వెళుతున్నారే గానీ ఇంతవరకు రైతులకు న్యాయం చేకూర్చలేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. వారితో పాటు అంజినప్ప, శ్రీధర్, హనుమంతు, పంపన్న, తిప్పేష్, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం



క్రీడలను ప్రారంభిస్తున్న జిల్లా అధికారి దివాకర్

కంప్లి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు నిత్యం ఒడిదుడుకులు, ఒత్తిడితో విధులు నిర్వహిస్తుంటారని, క్రీడలతోనే వారికి మనశ్శాంతి లభిస్తుందని జిల్లా అధికారి దివాకర్ పేర్కొన్నారు. ఆదివారం విజయనగర జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో జిల్లా స్థాయి పోలీసుల క్రీడలను ఆయన ప్రారంభించారు. ఇందులో 400 మీటర్ల గన్‌షూట్, ఇతర క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



బస్సు డోర్ వద్ద వేలాడుతున్న విద్యార్థులు

డోంట్ కేర్..!

బళ్లారి సిటీ,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిత్యం కళాశాలకు వెళ్లే విద్యార్థులు బస్సులు నిర్లక్ష్యంగా ప్రయాణిస్తున్నారు. ప్రాణాలను లెక్కచేయకుండా బస్సు డోర్‌కు వేలాడుతున్న దృశ్యాలు బళ్లారి నగరంలో నిత్యం కనిపిస్తోంది. నగరం నుంచి బొమ్మనహాళ్ తదితర గ్రామాలకు వెళ్లే బస్సుల్లో విద్యార్థులు డోర్ వద్దే వేలాడి ప్రయాణం చేస్తుండంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా తగినన్ని బస్సులు నడపాలని, విద్యార్థులు కూడా జాగ్రత్తంగా ప్రయాణించాలని వారు కోరుతున్నారు.

హోసూరు జోన్



పౌష్టికాహార కిట్‌లను అందజేస్తున్న మేయర్ సత్య

బాలింతలకు పౌష్టికాహార కిట్‌ల పంపిణీ

హోసూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేశారు. తమిళనాడు ప్రభుత్వం తరపున ఉండాల్సిన బరువుకంటే తక్కువ ఉన్న చిన్నారులకు, బాలింతలకు పౌష్టికాహార కిట్‌ల పంపిణీ వారంక్రితం చేపట్టారు. ఇందులో భాగంగా హోసూరు కార్పొరేషన్ పరిధిలో పౌష్టికాహారం భరోసా కార్యక్రమంలో నవజాత శిశువులతో కలసి బాలింతలు పాల్గొన్నారు. పౌష్టికాహార లోపం తీవ్రంగా ఉన్న పిల్లల తల్లులకు రెండు పౌష్టికాహార కిట్‌లను అందచేశారు. మేయర్ సత్య, కౌన్సిలర్ వెంకటేశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. మేయర్ సత్య మీడియాతో మాట్లాడుతూ తమిళనాడు ముఖ్యమంత్రి పిల్లల అభివృద్ధి, మానసిక స్థితిని పరిగణనలోకి తీసుకుని తమిళనాడు వ్యాప్తంగా బాలింతలకు పోషకాహార నిధిని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంల్లో సర్కిల్ కార్యదర్శి శేఖర్, నిర్వాహకులు శరవణన్, పన్నీర్‌సెల్వంతోపాటు స్థానికులు పాల్గొన్నారు.

థర్డ్‌ఫ్రంట్‌కు అవకాశం లేదు

● ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి దురై వైకో



హోసూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో థర్డ్ ఫ్రంట్‌కు అవకాశం లేదని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి దురై వైకో అభిప్రాయపడ్డారు. హోసూరులో ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్రలో బీజేపీ విజయం సాధించిందని, ఝార్ఖండ్‌లో కాంగ్రెస్ అఖండ విజయం సాధించిందన్నారు. మహారాష్ట్రలో ఎమ్మెల్యేలను గుర్రపు బేరాల తరహాలో వ్యవహరించి ఎన్నికల్లో విజయం సాధించిందని విమర్శించారు. కర్ణాటకలో కాంగ్రెస్ మూడుచోట్ల గెలుపొందిందన్నారు. కేరళ రాష్ట్రం వాయనాడ్‌లో ప్రియాంకగాంధీ 4లక్షలకుపైగా ఓట్లతో విజయం సాధించారన్నారు. భవిష్యత్తులో బీజేపీ విజయం సాధించలేదన్నారు. తమిళనాడులో 20-30ఏళ్ల వరకు థర్డ్ ఫ్రంట్‌కు అవకాశం లేదన్నారు. ఉమ్మడి సంక్షేమ లక్ష్యాలతో ఎన్ని పొత్తులు వచ్చినా సదరు కూటమికి ఆదరణల లేదన్నారు. ప్రస్తుతం తమిళనాడులో రెండు జట్లు ఉన్నాయన్నారు. ద్రావిడ మున్నేట్ర కళగం నేతృత్వంలో ఐఎన్‌డిఐఏ కూటమి ఉందన్నారు. 2026లో కూటమి నేతృత్వంలో ఘన విజయం సాధ్యమని అభిప్రాయపడ్డారు.



పట్టాల ప్రదానంలో ఏఐసీటీఈ చైర్మన్ డాక్టర్ సీతారామన్

స్టార్టప్‌ల దిశగా అడుగేయాలి: చైర్మన్

హోసూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పూర్తి చేసినవారు ఉద్యోగం కోసం తాపత్రయ పడకుండా స్టార్టప్‌ల దిశగా అడుగులు వేయాలని ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ డాక్టర్, ప్రొఫెసర్ టీజీ సీతారామ్ అభిప్రాయపడ్డారు. అదియమాన్ ఇంజనీరింగ్ కళాశాల 33వ స్నాతకోత్సవం నగరంలోని ఇండోర్‌స్పోర్ట్స్‌హాల్‌లో జరిగింది. ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ బానుమతి తంబిదురై అధ్యక్షత వహించారు. స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి డాక్టర్ సీతారామ్ ప్రసంగిస్తూ దేశంలో 1.75 లక్షల స్టార్టప్‌లు కొత్తగా ప్రారంభించి చక్కగా పనిచేస్తున్నాయన్నారు. వీటిని స్ఫూర్తిగా తీసుకుని ఇతరులు కూడా తమ ప్రతిభకు అనుగుణంగా స్టార్టప్‌లతో ఇతరులకు ఉపాధి కల్పించే దిశగా సాగాలన్నారు. నేటి ప్రపంచంలో టెక్నాలజీ అభివృద్ధి వేగంగా మారుతోందని ప్రతి విద్యార్థి అకడమిక్స్ మాత్రమే కాకుండా వ్యక్తిగత నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, జి.పి.టి. 16 సాంకేతికతతో సహ విద్యార్థులు పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో రోజురోజుకు కొత్త అవిష్కరణలు వస్తున్నాయని విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. దేశ అంతరిక్ష శాఖలో చంద్రయాన్ కార్యక్రమంలో 30శాతం మంది మహిళలు పనిచేయడం అభినందనీయమన్నారు. దేశంలో ఉన్నతవిద్యలో 28.5 శాతం మంది విద్యార్థులు ఉన్నారని కానీ దక్షిణకొరియా, ఇజ్రాయెల్ వంటి దేశాల్లో 95 శాతం మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. 2035 నాటికి భారత్‌లో ఉన్నతవిద్యను అభ్యసించే విద్యార్థులను 50 శాతానికి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు తీసుకుంటోందన్నారు. బెంగళూరు, హోసూరు ప్రాంతాల్లో చాలా కర్మాగారాలు ఉన్నాయని, ఫ్యాక్టరీలు సంస్థలు విద్యార్థులకు కూడా వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఫైనల్ ఇయర్‌లో ఉన్న సమయానికి, వారు తమ కర్మాగార శిక్షణను పూర్తి చేసి పూర్తి నైపుణ్యంతో బయటకు రావాలి, ఇప్పటివరకు దిగుమతి చేసుకునే స్థితిని మార్చుకున్న రక్షణ రంగాన్ని ఎగుమతి చేసే స్థాయికి భారత్ పురోగమిస్తోందన్నారు. విద్యార్థులు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ వంటి వివిధ విభాగాల్లో చదివినా ప్రతి ఒక్కరు భారతదేశంలో 45శాతం మంది ప్రజలు డిజిటల్ లావాదేవీలు చేస్తున్నారన్నారు. లోక్‌సభ మాజీ డిప్యూటీ తంబిదురై, సెక్రటరీ లాసియా తంబిదురై, ఓలా చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ శివకుమార్, అదియమాన్ కళాశాల డైరెక్టర్ రంగనాథ్ కళాశాల ప్రిన్సిపాల్ రాధకృష్ణన్, వేలాంగణి గ్రూప్ చైర్మెన్ కూడరసన్, ప్రొఫెసర్లు, పూర్వ విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయండి

హోసూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని రాష్ట్ర సరిహద్దులోని, జాతీయ రహదారులకు అనుబంధంగా వీధి దీపాలు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతం జూజూవాడీ చెక్‌పోస్టు సమీపాన జిల్లా రవాణా కార్యాలయం, పోలీసు చెక్‌పోస్టు తదితరాలు పనిచేస్తున్నాయి. ఈ ప్రాంతాల్లోనూ జాతీయ రహదారిపై కొన్ని నెలలుగా విద్యుత్తు సౌకర్యాలు లేవు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కావున రాష్ట్ర సరిహద్దులోని జాతీయ రహదారికి అనుబంధంగా విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.




చీకట్లోనే వాహన సంచారం ఇలా...

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి (జయంతి)



భవిష్యత్తు అంశాలను తెలిపే 'కాలజ్ఞానం' రచించిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 1608 నవంబరు 25న వైఎస్ఆర్ (కడప) జిల్లా కంది మల్లయ్యపల్లెలో జన్మించారు. వీరబ్రహ్మం, బ్రహ్మంగారు, వీరప్పయాచార్యులుగా పేరొందారు. కందిమల్లయపల్లె తర్వాతి కాలంలో బ్రహ్మంగారి మఠంగా ప్రసిద్ధి చెందింది. ప్రపంచంలో ఏ వింత జరిగినా ఇది బ్రహ్మంగారు తన కాలజ్ఞానంలో ఆనాడే చెప్పారంటూ ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటూ ఉంటారు. కాలజ్ఞానంలో చెప్పినవన్నీ జరిగాయి. నందమూరి తారక రామారావు స్వయంగా శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర సినిమాను నిర్మించి నటించారు. సీఎం అయ్యాక తెలుగుగంగ పథకానికి శంకుస్థాపన చేసి మఠానికి ఆనుకుని ఉన్న జలాశయానికి బ్రహ్మంసాగర్‌గా నామకరణం చేశారు. ప్రస్తుతం బ్రహ్మంగారి మఠం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒకటి. 1693లో సజీవ సమాధి అయ్యారు.

సాధు వాస్వాని (జయంతి)



సాధు వాస్వాని 1897 నవంబరు 25న హైదరాబాద్ సింధ్ ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు థన్వర్‌దాస్ లీలారామ్ వాస్వాని. విద్యలో విప్లవాత్మక మార్పుల కోసం కృషి చేశారు. ఉపనిషత్తులతోపట్టు బైబిల్, ఖురాన్‌లపై పట్టు సాధించారు. మహాత్మాగాంధీతో కలసి సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. కోల్కత్తా కాలేజీలో ప్రొఫెసర్‌గా హిస్టరీ, ఫిలాసఫీలను బోధించారు. 1966 జనవరి 16న కన్నుమూశారు. ఆయన గౌరవార్థం ప్రత్యేక పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

వీరేంద్రహెగ్డే (పుట్టినరోజు)



'పద్మవిభూషణ్' గ్రహీత ప్రముఖ మానవతావాది డీ వీరేంద్రహెగ్డే 1948 నవంబరు 25న దక్షిణకన్నడ జిల్లా బంట్వాళ ప్రాంతంలో జన్మించారు. ధర్మస్థళలో ప్రసిద్ధి చెందిన మంజునాథస్వామి ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్త (ధర్మాధికారి)గా కొనసాగుతున్నారు. ఆలయ ట్రస్టు ద్వారా సాహిత్యంతోపాటు సమాజసేవలందిస్తున్నారు. యోగా, నేచురోపతిని విస్తరింపచేయడంతోపాటు పలు చోట్ల పెళ్లి మండపాలు నిర్మించారు. ఆలమాల అభివృద్ధికి కృషి చేయడతోపాటు నిరుపేదలకు చేయూత అందిస్తున్నారు. కర్ణాటక రత్న, పద్మశ్రీ, వంటి అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు. 2022 నుంచి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

అక్రమ ఆదాయం దుఃఖానికి కారణం

» మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే



ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే

శిడ్లఘట్ట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్ని ఆస్తులు సంపాదించినా సరే చట్ట పరిధిని అతిక్రమించరాదని, ఆదాయానికి తగిన పన్నులు చెల్లించాలని, అక్రమ ఆదాయం దుఃఖానికి కారణమవుతుందని మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే అభిప్రాయపడ్డారు. పట్టణంలోని లియోక్లబ్ ఆఫ్ కిరణ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన మెగా ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ తాను లోకాయుక్త అయ్యాక సమాజంలోని పరిస్థితిని అర్థం చేసుకున్నానన్నారు. సమాజంలో పేరొందిన శ్రీమంతులయ్యేందుకు కారణం, కొందరు అక్రమార్కుల ఆర్థిక వ్యవహారాలేనని తెలిసిందన్నారు. ప్రస్తుత సమాజంలో మనవతా విలువలను వెతుక్కోవాల్సి వస్తోందన్నారు. మానవత్వంతోనే సమాజంలో చక్కటి మార్పు, ప్రశాంతత సాధ్యమన్నారు. నేటి యువత భవిష్యత్తు తలుచుకుంటే భయం వేస్తుందన్నారు. పాఠశాలల్లో పాఠాలు తప్ప మంచి చెడుల గురించి చెప్పేవారు తక్కువయ్యారని విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుత యాంత్రిక యుగంలో తల్లిదండ్రులు సైతం ఉద్యోగం, వ్యాపారం తమవంతు బిజీగా గడుపుతున్నారన్నారు. ఇటువంటి తరుణంలో యువతకు సరైన మార్గదర్శకం లేక పెడతోవ పట్టకుండా చూసేలా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాగా అవినీతి సంపాదనతో పొందిన ఆస్తులు, నగలు ఇతరత్రా వాటివల్ల మానసిక ప్రశాంతత ఉండదన్నారు. కావున సన్మార్గంలో సంపాదించి చక్కగా జీవనం సాగించేందుకు ప్రయత్నించాలని హితవు పలికారు. హైకోర్టు న్యాయవాది రవిశంకర్, గ్రేడ్2 తహసీల్దారు పూర్ణిమాలు ప్రసంగించారు. కార్యక్రమంలో పోలీసు అధికారి రమేశ్, సిఐ శ్రీనివాస్, ఎస్సై వేణుగోపాల్, క్రెసెంట్ విద్యాసంస్థ కార్యదర్శి మహ్మద్ తమీమ్ అన్సారి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్రాల కృషితోనే విద్యలో సమూల మార్పులు: వీసీ

» బెంగళూరు వీవీ వైస్‌చాన్స్‌లర్ జైకర్‌శెట్టి

బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యుత్తమ విద్యావ్యవస్థకోసం పాటుపడుతున్నాయని తద్వారా భారీగా మార్పులకు కారణమైందని బెంగళూరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ జైకర్‌శెట్టి అభిప్రాయపడ్డారు. ఆదివారం నేషనల్ కళాశాలలో స్నాతకోత్సవంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు అకడమిక్‌తోపాటు వేగవంతంగా ప్రగతిదశలో వెడుతున్న సాంకేతికత విధానాలకు అనుసంధానం కావాలన్నారు. విద్య అంటే కేవలం సర్టిఫికెట్‌ల కోసం కాదని, ఉత్తమమైన భవిష్యత్తుకోసమన్నారు. డిగ్రీలతోపాటు సమాజంలో అతిపెద్ద బాధ్యతలో భాగస్వాములు అవుతున్నారన్నారు. 16 మందికి బంగారు పతకాలు, 485మందికి డిగ్రీ పట్టాలతోపాటు 52 మందికి పీజీ పట్టాలు ప్రదానం చేశారు. ఫ్లోరిడా యూనివర్సిటీ ప్రొఫెసర్ సుందర్‌రాజ్ సీతారాం అయ్యంగార్, నేషనల్ కళాశాల ప్రెసిడెంట్ హెచ్‌ఎన్ సుబ్రహ్మణ్య, సెక్రటరీ వెంకటశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు కళలు నేర్చుకోవాలి

» ఎస్ఎస్ఎం పబ్లిక్ స్కూల్‌లో డాక్టర్ విజయలక్ష్మి పిలుపు

బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు చిన్నారులు, సంస్కృతి, కళలు నేర్చుకోవాలని జయదేవ ఆసుపత్రుల పీడియాట్రీషియన్, ప్రొఫెసర్ ఐబి విజయలక్ష్మి అభిప్రాయపడ్డారు. ఎస్ఎస్ఎం పబ్లిక్‌స్కూల్ 57వ వార్షికోత్సవాన్ని సంఘం పేరిట పీఈఎస్ యూనివర్సిటీ రింగ్‌రోడ్డు క్యాంపస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి విజయలక్ష్మి మాట్లాడుతూ మన సంప్రదాయంలో ఎన్నో కళలు ఉన్నాయన్నారు. వాటిని నేర్చుకోవడం ద్వారా మేధస్సు పెరుగుతుందని సంగీతం, నృత్యం వంటివి అనునిత్యం ఉత్తేజంగా ఉండేందుకు దోహదపడ తాయన్నారు. యోగా, మంచి ఆహారపు అలవాట్లను క్రమం తప్పకుండా పాటించాలన్నారు. పీఈఎస్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ శైలశ్రీ హరిదాస్, డైరెక్టర్ ఎంవీ సత్యనారాయణ, ఎస్ఎస్ఎం పబ్లిక్‌స్కూల్ రక్షావర్మలు పాల్గొన్నారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.



ప్రశంసాపత్రాలు ప్రదానం చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

భాషకు మరింత ప్రోత్సాహం అవసరం



కైవారలో కన్నడ రాజ్యోత్సవంలో వివిధ రంగాల సాధకులకు సన్మానం

చింతామణి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజుల కాలంతో పోలిస్తే స్వాతంత్ర్యానంతరం భాషకు ప్రాధాన్యత పెరిగిందని ప్రస్తుత తరుణంలో భాషకు మరింత ప్రోత్సాహం అవసరమని కైవార యోగి నారేయణ ట్రస్టు అధ్యక్షుడు, కైవార ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కైవార అమరనారాయణస్వామి సమీపం లోని బస్టాండ్‌లో కైవార ప్రజల హితరక్షణా వేదిక ఆధ్వర్యంలో 69వ కన్నడ రాజ్యోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. కన్నడ భాషకు వేల సంవత్సరాల చరిత్ర ఉందని, ఎంతోమంది సాహితీవేత్తలు, ధార్మికులు ఇతోధికంగా ప్రోత్సహించారన్నారు. భాష మనుగడకు సంస్కృతి ముడిపడి ఉందన్నారు. బసవణ్ణ, కైవార తాతయ్య వంటి మహనీయులు సమాజంకోసం కృషి చేశార న్నారు. నాదసుధారస సంకీర్తనా ప్రాజెక్టు సంచాలకులు విద్వాన్ బాలకృష్ణ భాగవతార్, సంఘం అధ్యక్షుడు కెంపరాజు ముఖ్యులుగా విచ్చేశారు. తొలుత బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించి కన్నడ పతాకాన్ని ఎగురవేశారు. ఇదే సందర్భంగా వివిధ రంగాల సాధకులకు జ్ఞాపికలు అందచేసి సత్కరించారు. కైవార గ్రామపంచాయతీ అధ్యక్షురాలు ఉమాదేవి, ఉపాధ్యక్షుడు యాస్మిన్ తాజ్, కన్నడ అధ్యాపకులు యరమరెడ్డిహళ్ళి వెంకటరవణప్ప తదితరులు పాల్గొన్నారు.

మంగళముఖిల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

» ప్రత్యేక వేడుకలో డిమాండ్

బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంగళముఖిల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.200కోట్ల గ్రాంటు కేటాయించాలని మంగళముఖిల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. నగరంలో ఆదివారం కర్ణాటక క్వీర్ హబ్బ పేరిట ప్రత్యేక వేడుకలు జరిపారు. టౌన్‌హాల్ వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో మంగళముఖిల కోసం ప్రత్యేకమైన కమిటీ ఏర్పాటు చేసి హక్కుల సంరక్షణకు విధి విధానాలు రూపొందించాలన్నారు. రిజర్వేషన్ల ద్వారా విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, వసతి సౌలభ్యాలు కల్పించాలన్నారు. లైంగిక కార్యకర్తలపై పోలీసుల దౌర్జన్యాలు నిలుపుదల చేయాలన్నారు. కర్ణాటక ట్రాన్స్‌జెండర్ పాలసీ 2017ను సమష్టిగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వం అన్ని పథకాల్లోనూ మంగళముఖిలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. హెచ్‌ఐవి బాధితులకు ఉచిత వైద్యం, పౌష్టికాహారం ఇవ్వాలని కోరారు.

మహిళా పారిశ్రామికవేత్త ఆత్మహత్య కేసులో సీఐడీ డీఎస్పీపై ఎఫ్ఐఆర్

బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బోవి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతికి సంబంధించిన వివాదంలో ఆత్మహత్యకు పాల్పడిన మహిళా పారిశ్రామికవేత్త జీవా కేసులో సీఐడీ డీఎస్పీ కనకలక్ష్మిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జీవా చెల్లెలు సంగీత ఫిర్యాదు మేరకు బనశంకరి పోలీసులు అవినీతి నిరోధకచట్టం, ఆత్మహత్యకు ప్రేరేపణ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. శుక్రవారం రాఘవేంద్ర లే అవుట్‌లోని ఇంట్లో జీవా ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆమె చెల్లెలు సంగీత స్థానిక బనశంకరి పోలీసులకు శనివారం చేసిన ఫిర్యాదులో బోవి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతికి సంబంధించి సిద్ధాపుర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ఇందుకు సంబంధించి హైకోర్టు ఆదేశాల మేరకు సీఐడీ విచారణలు ఎదుర్కొవాల్సి ఉండేదన్నారు. హైకోర్టు నవంబరు 14-23 తేదీల మధ్యన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. కానీ డీఎస్పీ కనకలక్ష్మి ఈనెల 14న విచారణకు తీసుకెళ్లి వివస్త్రను చేసి సైనేడ్ తీసుకొచ్చావా.. అంటూ చిత్రహింసలకు గురిచేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బు ఎలా సంపాదిస్తున్నావంటూ ప్రశ్నించడమే కాకుండా రూ.25లక్షలు ఇవ్వాలని వేధించారన్నారు. ప్రతిరోజూ విచారణ పేరిట హింసించారని, అవమానానికి గురైన అక్క జీవా 14పేజీల డెత్‌నోట్‌రాసి ఆత్మహత్యకు పాల్పడినట్టు చెల్లెలు సంగీత ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు డీఎస్పీ కనకలక్ష్మిపై ఎఫ్ఐఆర్ నమోదైంది.

ఇద్దరు సిండికేట్ బ్యాంకు ఉద్యోగులకు జైలుశిక్ష, జరిమానా

బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సిండికేట్‌బ్యాంకులో మేనేజర్‌గా కొనసాగుతూ రూ.12.63 కోట్ల మోసానికి పాల్పడిన ఇద్దరు ఉద్యోగులు సహా ముగ్గురికి సీబీఐ ప్రత్యేక కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.52లక్ష జరిమానా విధించింది. వీరు తప్పుడు రికార్డులు సృష్టించి అనర్హత వ్యక్తులకు రుణాలు మంజూరు చేశారనే ఆరోపణలతో 2009లో కేసు నమోదైంది. సిండికేట్ బ్యాంకు మండ్య శాఖలో మేనేజర్‌గా కొనసాగిన హెచ్‌ఎం స్వామి, కొళ్ళేగాల మేనేజర్ విఠల్ దాస్‌లపై బ్యాంకు విజిలెన్స్ విభాగం గుర్తించింది. ఈమేరకు సీబీఐలో అప్పట్లోనే కేసు నమోదైంది. రూ.12.63 కోట్ల మోసానికి పాల్పడినట్టు 2010 డిసెంబరులో చార్జ్‌షీట్ దాఖలైంది. శుక్రవారం బెంగళూరు సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పును ప్రకటించింది. హెచ్‌ఎం స్వామికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1.50 లక్షల జరిమానా, విఠల్ దాస్‌కు ఏడాది జైలు శిక్ష రూ.50వేల జరిమానా విధించారు. ఈ అవినీతిలో బ్యాంకుతో సంబంధం లేని వ్యక్తి అసదుల్లాఖాన్‌కు మూడేళ్ల జైలుశిక్షతోపాటు 50 లక్షల రూపాయల జరిమానా విధించారు.

పిస్తోల్ కలకలం



గుత్తిలో లభ్యమైన పిస్తోల్

గుత్తి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని జడ్‌వీరారెడ్డి కాలనీలో ఆదివారం పిస్తోల్ కలకలం రేపింది. ఓ ఇంటి వెనుక భాగంలో ప్లాటు ఏర్పాటుకు రాళ్లను తొలగిస్తుండగా రాళ్ల కింద పిస్తోల్ బయటపడింది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి ఎస్ఐ సురేష్ చేరుకొని ఆ పిస్తోల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు రహస్యంగా ఉంచి విచారణ చేస్తున్నట్లు సమాచారం.

ఆర్థరైటిస్ పట్ల నిర్లక్ష్యం చేయరాదు



సదస్సులో మంత్రి శరణప్రకాశ్ పాటిల్

బెంగళూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్థరైటిస్ పట్ల నిర్లక్ష్యం చేయరాదని వైద్యవిద్యాశాఖ మంత్రి శరణప్రకాశ్ పాటిల్ అభిప్రాయపడ్డారు. నగరంలో ఐరాకాన్ 2024 పేరిట అర్థరైటిస్ వైద్యనిపుణుల జాతీయ సదస్సును మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. అర్థరైటిస్‌లో కీళ్లనొప్పుల నివారణకు ఆధునాతన చికిత్సలు వచ్చాయని వాటిని రోగులకు వివరించాలన్నారు. ఐరాకాన్ ముఖ్యులు డాక్టర్ చంద్రశేఖర్, నాగరాజ్ పాల్గొన్నారు. ఆదివారంతో ముగిసిన నాలుగు రోజుల సదస్సులో 4వేలమంది వైద్యనిపుణులు పాల్గొనగా పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తోపాటు పలు పరిశోధనా కథనాలను వివరించారు.

ఆలయంలో చోరీ

కళ్యాణదుర్గం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం కదిరిదేవరపల్లిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన మేరకు.. కార్తీక మాసం కావడంతో శనివారం రాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. తరువాత ఆలయానికి తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం అర్చకుడు తిప్పేస్వామి తాళాలు పగులగొట్టినట్లు గుర్తించారు. విషయాన్ని గ్రామస్థుల ద్వారా పోలీసులకు తెలిపారు. డీఎస్పీ రవిబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. శనివారం గుర్తుతెలియని వ్యక్తులు సంచరించారని, వారే ఈ చోరీకి పాల్పడి వుండవచ్చునని భావిస్తున్నారు.

పిల్లల భవిష్యత్తుపై దృష్టి సారించండి



మంగళనాథస్వామీజీకి సన్మానం

బాగేపల్లి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తును నాశనం చేసే వస్తువులను పిల్లలకు ఇవ్వరాదని ఆదిచుంచనగిరి మఠం చిక్కబళ్ళాపుర శాఖ అధిపతి మంగళనాథ స్వామిజీ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని బిజిఎస్ పబ్లిక్‌స్కూల్‌లో పాఠశాల పాలకవర్గం ఏర్పాటు చేసిన మాతృభోజన, 2024 వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మనం ఏ భాష నేర్చుకున్నా, విదేశాలలో ఉన్నా మన సంస్కృతి సంప్రదాయాలను మరువరాదని, కన్నవారిని, విద్య నేర్పిన గురువులను గౌరవించాలన్నారు. పిల్లలు సుమారు 8 గంటలపాటు పాఠశాలలో గడుపుతారని మిగిలిన సమయం ఇంట్లో ఉంటారని తద్వారా గురువులకంటే తల్లిదండ్రులపై బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. మంచి చెడుల గురించి చిన్నారులకు తెలియ చేయాల్సిన తొలి కర్తవ్యం తల్లిదండ్రులదే అన్నారు. విద్యార్థి దశలో దారి తప్పకుండా సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రిటైర్డు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ది మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు అనవసరంగా మొబైల్ అలవాటు చేయరాదన్నారు. 18ఏళ్ల లోపువారికి ద్విచక్ర వాహనాలు ఇచ్చి నేరాలకు కారణం కావద్దని హితవు పలికారు. అలాగే బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని, మూఢనమ్మకాలు పాటించరాదన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు తల్లులు తాము తెచ్చిన వివిధ రకాల తినుబండారాలను ఆప్యాయంగా తినిపించారు. మంగళనాథస్వామిజీని ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఐ శివరామరెడ్డి, బీఈఓ వెంకటేశప్ప, పురసభ ఉపాధ్యక్షురాలు సుజాత నరసింహనాయుడు, సభ్యురాలు నరసింహమూర్తి, ప్రిన్సిపాల్ మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

సంబరంగా కార్తీక ఉత్సవం



శ్రీకృష్ణుడి పల్లకీ ఊరేగింపులో భక్తులు

దొమ్మసంద్ర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర పరిధిలో సోంపుర గేట్ సమీపాన ట్రినిటి అపార్ట్‌మెంట్‌లో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. ఇస్కాన్ సంస్థ దొమ్మసంద్ర విభాగం వేణుమాధవదాస్ అధ్యక్షత వహించారు. అపార్ట్‌మెంట్ వాసులు, స్థానికులు శ్రీకృష్ణ హరికీర్తన, భజన, నగర సంకీర్తన, నామస్మరణతో పురవీధులలో శ్రీకృష్ణుడిని పల్లకీలో ఊరేగించారు. ఈ సందర్భంగా వేణుమాధవదాస్ మాట్లాడుతూ ఇటీవలికాలంలో కొందరు హిందూ ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారన్నారు. దీని ప్రభావంతో కొందరు ఇతర మతాలలోకి మారుతున్నారన్నారు. హిందూ ధర్మంలో ఇతర మతాలపట్ల కించపరిచేలా ఎక్కడా ఉండదన్నారు. మన సంస్కృతి, ఆచార వ్యవహారాల గొప్పదనాన్ని నేటియువతకు తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్సవంలో 1500మందికిపైగా భక్తులు పాల్గొనగా తీర్థప్రసాదాలు పంపిణీ అనంతరం అన్నదానం నిర్వహించారు. ట్రినిటీ అపార్ట్‌మెంట్ వాసులు గీతా సురేశ్, సబితా, కల్యాణ్, శ్రీనివాస్, చందాపుర స్వామి వివేకానంద గ్రామీణ విద్యాసంస్థకు చెందిన వెంకటేశ్‌రెడ్డి, ఇస్కాన్ సంస్థ పదాధికారులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



ప్రవీణ్ (ఫైల్)

చింతామణి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చింతామణి - మదనపల్లి రహదారి మార్గంలో దండుపాళ్య సమీపాన కారు, బైక్‌ల మధ్య శనివారం జరిగిన ప్రమాదంలో బైక్ చోదకుడు మృతి చెందిన ఘటనా స్థలంలోనే ఆదివారం మరో ప్రమాదం చోటు చేసుకుంది. ఉదయం 11 గంటలకు కారు, ప్రైవేట్ బస్సు ఢీ కొన్న ప్రమాదంలో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారు అతివేగంగా అజాగ్రత్తంగా బస్సును ఢీ కొన్న ప్రమాదంలో డ్రైవర్ తలకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. బస్సు ముందుభాగం చక్రం, అద్దాలు దెబ్బతినగా కారు ముందుభాగం గుర్తుపట్టలేనంతగా ధ్వంసమైంది. కారు డ్రైవర్ సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా కలకడ మండలం గంగాపుర సమీపంలోని రంగప్పగారిపల్లికి చెందిన ప్రవీణ్ చంద్రనాయుడు (44)గా గుర్తించారు. కారులో చిక్కుకున్న మృతదేహాన్ని పోలీసులు శ్రమించి ప్రొక్లైనర్ ద్వారా వెలికితీసి చింతామణి ఆసుపత్రికి తరలించారు. బెంగళూరులోని ఏఎన్‌జడ్ ప్రైవేట్ సంస్థలో పనిచేసే ఇతను బెంగళూరు నుంచి చింతామణి మీదుగా స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రైవేట్ బస్సు డ్రైవర్ సహా సుమారు 30మంది ప్రయాణీకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను చింతామణిలోని వివిధ ఆసుపత్రులలో చేర్పించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ మురళీధర, కెంచార్లహళ్ళి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరామప్ప, కెంచార్లహళ్ళి ఎస్సై శివకుమార్, చింతామణి రూరల్ ఎస్సై నాగేంద్రప్రసాద్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు.



సహాయక చర్యల్లో పోలీసులు, స్థానికులు

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా: మంత్రి భరత్



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం నాయకులు

అనంతపురం కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ ఒక్క ఆర్యవైశ్యునికి సమస్య వచ్చినా అండగా నిలిచి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర యువజన సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి భరత్‌తోపాటు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. ప్రమాణ స్వీకారోత్సవ సభలో భరత్ మాట్లాడుతూ తెలుగుదేశ పార్టీ ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు తనపై నమ్మకంతో రాష్ట్రానికి ఎంతో కీలకమైన పరిశ్రమలశాఖకు తనను మంత్రిగా చేశారని కొనియాడారు. దేశ, విదేశాల నుంచి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు తరలివస్తున్నారన్నారు. జిల్లాలో ఆర్యవైశ్యుల సత్రం ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ సేవకు మారుపేరు ఆర్యవైశ్యులని, వారి సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరించి యువతకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వ్యాపారులు మాత్రమే కాదని, సామాజిక సేవకులు కూడా అని పేర్కొన్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఐక్యత చూస్తుంటే తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ ఆర్యవైశ్యుడైన పొట్టిశ్రీరాములు పోరాటంతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన జరిగిందని, ఆ మహనీయుని సామాజికవర్గమైన ఆర్యవైశ్యులంతా ధన్యులేనని కొనియాడారు. అనంతరం ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు శబరి వరప్రసాద్‌తోపాటు కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, టీడీపీ నాయకులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, జనసేన నాయకుడు భవానీ రవికుమార్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నిరామ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు పెనుగొండ సుబ్బరాయుడు, నాయకులు కోటా సత్యం, తిరువీదుల జగదీష్ కుమార్, దేవకీ వెంకటేశ్వర్లు, శిరిగుప్ప వెంకటేశ్వర్లు, మనోజ్, కలవల సతీష్, వంకదారు వెంకటకృష్ణ, ముడియం రమణ, గోపా మచ్చా నరసింహులు, పిన్ని నాగరత్నం పాల్గొన్నారు.